


# క్షీరసాగర మథనం

- నిర్మలాదిత్య

*(గత సంచిక తరువాయి)*

బెత్ విశ్వం ప్రశ్నలు వేయకుండడానికి అన్నట్లు కొత్త అకౌంట్లు పని అప్పజెప్పింది. పిరమిడ్ గ్రూప్, రెడ్ రాక్ కేసినో ఆలోచనలు పక్కకు పెట్టి కొత్త అకౌంట్ల పరిశీలనలో పడి పోయాడు. ఇవన్నీ రొటీన్ అకౌంట్లే. అనుమానానికి అవకాశం ఇవ్వని అకౌంట్లు.

మధ్యాహ్నం లంచ్ టైం లో సీత నుండి ఫోన్. MRI రిపోర్ట్ కని కాన్సర్ సెంటర్ అప్పాయింట్మెంట్ 1 గంట కని. విశ్వం గుర్తుందని, రిపోర్ట్ వివరాలు తెలిసిన వెంటనే ఫోన్ చేసి చెప్తానని సీతకు చెప్పి కెఫిటీరియా కు దారి తీసాడు. అక్కడ బాగానే రష్ ఉంది. సామాన్యంగా సలాడ్ సూప్ తో తన లంచ్ ముగించేస్తాడు విశ్వం. అదేంటో ఈ మధ్య గ్రీసి, ఫ్రైడ్ వంటలంటే ఇష్టం అయ్యిపోయింది. అలాంటి వాటి మీద తనకు ఎప్పుడూ ఇష్టమేనేమో. కాదంటే ఆరోగ్యంకోసం గత పదేళ్లు మితంగా తింటూ, శరీరం కూడా బరువు తగ్గించుకొని ఓ పదేళ్ల తక్కువ గా కనిపిస్తున్నావని అందరి దగ్గర విన్నాడు విశ్వం. చైనీస్ ఫ్రైడ్ రైస్ మీద ఆలోచనలు ఆపి తిరిగి సలాడ్ బార్ వైపు నడిచాడు.

సలాడ్ తీసుకొని ఖాళీగా ఉన్న టేబిల్ వైపు వెళ్లి కూర్చున్నాడు. దారిలో తెలిసిన వారుఎదురైయ్యారు, కానీ తాను తొందరగా తిని హాస్పిటల్ కు పోవాలి. విశ్వం కు ఇది వరకు లాగా సహచరులతో కలిసి అవీ, ఇవీ ఛలోక్తులు వేస్తూ తినాలనిపించడం లేదు. పని ధ్యాస లేకపోతే, తన కాన్సర్, భవిష్యతు గురించిన ఆలోచనల నుండి బయట పడలేక పోతున్నాడు.

కాన్సర్ సెంటర్ లో మళ్లీ నర్స్ ప్రాక్టీషనేర్ తోనే అప్పాయింట్మెంట్. ఎక్కువ సేపు వేచి ఉండాల్సిన అవసరం పడ లేదు. నర్స్ ప్రాక్టీషనేర్ రిపోర్ట్ చూసి, బయాప్సీ రిపోర్ట్ వివరాలను దృఢ పరిచాయని, కాదంటే కాన్సర్ ప్రోస్టేట్ లోనే వుండి బయట వ్యాపించలేదని, అది MRI వల్ల నే తెలిసింది అని చెప్పాడు. సర్జరీ, రేడియేషన్ ఏదైనా ఎంచుకోవచ్చు. కీమో అవసరం లేదని చెప్పాడు.

రేడియేషన్ డిపార్ట్మెంట్ కు వెళ్లి అక్కడ డాక్టర్ ను కలిసాడు. వాళ్ళు ఓ రెండు నెలలు పైగా అప్పుడప్పుడు రేడియేషన్ కు రావలసి వస్తుందని, రేడియేషన్ లోనే రెండు మూడు ఆప్షన్స్లు వివరించాడు. రేడియేషన్ వల్ల సైడ్ ఎఫెక్టులు కూడా వివరించాడు.

డిపార్ట్మెంట్ నుండి బయటకు వస్తుంటే ఇద్దరు అమ్మాయిలు విశ్వం ను ఆపారు. తాము ప్రోస్టేట్ కాన్సర్ మీద రీసెర్చ్ చేస్తున్నామని తమ ప్రాజెక్ట్ గురించి వివరించ సాగారు. విశ్వం కు వినే మూడ్ లేక పోయింది. పేపర్లు ఇవ్వండి, చదివి మిమ్మలను కాంటాక్ట్ చేస్తాను అని సున్నితంగా తప్పుకున్నాడు.

ఆఫీసుకు తిరిగి వస్తూ సీతకు ఫోన్ చేసాడు. సీత ఆపేరేషనా, రేడియేషనా అని అడిగింది. విశ్వం జవాబు చెప్పే లోపలే డాక్టర్ వెంకటేసులును సాయంత్రం అడిగి ఆలోచిద్దాం లెండి అంది.

ఆఫీసు కు వచ్చిన వెంటనే బెత్ నుండి చాట్ లో మెసేజి లు కనిపించాయి. చాట్ లో బదులిచ్చే బదులు, కలుద్దాం అని బెత్ రూమ్ కి వెళ్ళాడు విశ్వం. బెత్ ఎదురుగా అప్పుడే కాలేజి లో నుంచి వచ్చిన ఇంటర్న్ లాగా ఓ చిన్న అమ్మాయి కనిపించింది. వయస్సు ఎంత మార్పు తెస్తుంది. యుక్త వయస్సు లో ఉన్నవారిలో ఆదో ప్రత్యేకమైన అందం ఉంది. అది యవ్వనం దాటిపోయాక కానీ తెలియదు అనుకున్నాడు విశ్వం.

"నిన్నే పిలిపిద్దామనుకున్న. నువ్వే వచ్చావు. గుడ్. మీట్ జూలీ. మన బ్యాంక్ లోనే ఇంటర్న్ గా గత సంవత్సరం పని చేసింది. ఇప్పుడే మన బ్యాంక్ కు ఉద్యోగిగా క్యాంపస్ ప్లేస్మెంట్లో తీసుకున్నాం. మంచి తెలివైన పిల్ల. నిన్ను షాడో చేయమని చెప్పాను. పని నేర్పించు. అలానే తను అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పి గైడ్ చేయి. జూలీ, విశ్వం బ్యాంకులో చాలా ఏళ్లుగా పనిచేశాడు. ఇంత కంటే మంచి మెంటర్ నీకు దొరకదు", అంటూ అప్పగింతలు ముగించేసింది.

బయటకు వస్తుంటే జూలీ ఉత్సాహం, అడిగే ప్రశ్నలు చూస్తే ముచ్చట వేసింది. తాను ఉద్యోగం చేరిన కొత్తలో దినాలు గుర్తుకు వచ్చాయి. అప్పటికే ఐదు అవ్వుతుండడం తో, రేపు కలుద్దాం అని జూలీ తో చెప్పి, ఇంటికి బయలు దేరాడు, విశ్వం. ఇంటికి కమ్యూట్ ఓ గంట. కారులో పబ్లిక్ రేడియో న్యూస్ వస్తున్నది. ఈ గంట విశ్వం మెదడుకు మేత. ఎదో ఆలోచిస్తూ యంత్రింకంగా కారు నడిపేయొచ్చు. అందుకేనేమో, మొదట్లో విసుకున్నా, కమ్యూట్ అంటే ఈ రోజులలో విశ్వం ఎదురు చూడడం మొదలెట్టాడు.

ఎందుకో ఇంటికి చేరిన తరువాత కంటే ఇప్పుడే డాక్టర్ వెంకటేసుల కు ఫోన్ చేయాలనిపించింది. అందు వల్ల సీత తో మరింత సమయం అవిరామంగా గడపచ్చు అన్న ఆలోచన కారణం కావచ్చు.

డాక్టర్ వెంకటేసుల వెంటనే ఫోన్ ఎత్తుకున్నాడు. అతనూ కార్లో ఇంటికి పోతున్నట్టు చెప్పాడు. విశ్వం చెప్పినదంతా విని,

"విశ్వం, కాన్సర్ బయట వ్యాపించలేదు కాబట్టి మంచి వార్తే. నా ఉద్దేశ్యంలో సర్జరీ నే మంచిది. నీవు ఆరోగ్యం గా ఉన్నావు. ఓ రెండు రోజులు తట్టుకున్నావంటే ఈ కాన్సర్ నుండి నీకు పూర్తి విముక్తి లభించినట్లే. రేడియేషన్ అంటే సమయం పడుతుంది, కానీ ఆపరేషన్ అంత రిస్కీ లేదు", అన్నాడు.

విశ్వం కూడా సర్జరీ మంచి ఆప్షన్ అనిపించింది. బెత్ లాంటి మేనేజర్ లు ఉన్నంత కాలం దినాలు కొద్దీ టైం ఆఫ్ తీసుకోవడం మంచిది కాదు. అలా అనుకుటుండగానే జూలీ గుర్తుకు వచ్చింది. జూలీ పని నేర్చుకోవడానికి విశ్వం దగ్గర వేశారో, లేక విశ్వం బదులు జూలీ పని చేయడానికి ఈ షాడో పని ఇచ్చారో విశ్వం కు అంతుబట్టలేదు. ఉండే ఆలోచనల మీద, ఇదో కొత్త బాధ ఎందుకు కోరి తెచ్చుకోవడం అని బలవంతంగా రేడియో వినడానికి ప్రయత్నించాడు, విశ్వం.

## –20 –

2001

- అమెరికా వరల్డ్ ట్రేడ్ సెంటర్ పై తీవ్ర వాదుల దాడి. జాతీయ, అంతర్జాతీయ సంస్థల మధ్య మరింత అవగాహన, సహకారం పెంపొందించే చర్యలు చేపట్టనున్న అమెరిక
- భారత దేశ పార్లమెంట్ పై తీవ్రవాదుల దాడి

బోర్డ్ మీటింగ్ అయ్యిపోయిన వెంటనే పి.ఎల్. మహేష్ కు ఉండమని సంజ్ఞ చేసాడు. రూము మిగతా వారందరూ ఖాళీ చేయగానే తలుపు దానంటికి అదే మూసుకుపోయింది.

"మహేష్ ఈ మధ్య మన లెథర్ ఫేక్టరీ చుట్టుపక్కనున్న వారికంతా, ఎదో కొత్త జబ్బు వచ్చిందట కదా. బయప్ప రెడ్డి మొన్న ఫోన్ చేసి చెప్పాడు, అదో పెద్ద రచ్చ గా తయారయ్యే ప్రమాదముందని. అన్నీ ఫ్యాక్టరీలను కోర్టుకి లాగి మూయించి, నష్ట పరిహారం కోరే లాగుంది అని హెచ్చరించాడు", అన్నాడు పి.ఎల్.

"సార్, మొన్న ఎలక్షన్స్ లో బాగానే ముట్ట చెప్పాం కదా. హెచ్చరిచడం దేనికి?", అన్నాడు మహేష్.

"మంచి ప్రశ్నే. మనమిచ్చిన డబ్బు కు బయప్ప రెడ్డి తనకు మాత్రమే తెలిసిన ప్రభుత్వ ఆంతరంగిక విషయాలు మనతో పంచుకున్నాడు. దాని వల్ల మనం ఆ ఫ్యాక్టరీ మూసేయాలి అనుకున్నాము. అది మనకు కలసి వచ్చినట్లే కదా. ఇక హెచ్చరిక అంటావా, బయప్ప రెడ్డి ఆయన పార్టీ కొంచెం షాక్ లొనే ఉన్నారు. అత్తెసరు ఓట్ల తేడాతో గెలిచిన తరువాత, వచ్చేసారి ఎలక్షన్స్ ఇంకా కష్ట తరమని వాళ్లకు తెలుసు. అందుకే ఇప్పటి నుండే రాబోయే ఎలెక్షన్లకు డబ్బులు సేకరించడం మొదలెట్టారు", అన్నాడు పి.ఎల్.

"బయప్ప రెడ్డికి మళ్లీ డబ్బు పంపించాలా? ఎలా ముట్టజెప్పాలంటారు. హవాలా న మరో విధంగానా?', అడిగాడు మహేష్

"బయప్ప రెడ్డి సెక్రెటరీ కి వెంటనే మన గ్రూపు తోలు వ్యాపారం నుంచి తప్పుకుంటుందని చెప్పు. ఈ విషయం వచ్చే నెల బోర్డ్ మీటింగ్ అయ్యిన తరువాత కానీ ప్రెస్ కు రిలీజ్ చేయొద్దు. ముందుగా తెలిసిన ఈ సమాచారాన్ని, స్టాక్ మార్కెట్, స్టాక్ బ్రోకర్ ల ద్వారా ఎలా డబ్బు చేసుకోవాలో బయప్ప రెడ్డి మనుష్యులకు బాగా తెలుసు", అన్నాడు పి.ఎల్.

"కానీ మీరు చెప్పే దాని బట్టి ఈ వివాదం ఇంతటితో పోయేటట్టు లేదు. మన ఫ్యాక్టరీల లో పని చేసిన కొంత మందికి కాన్సర్ కూడా వచ్చిందని అంటున్నారు. ప్రెస్ పసికట్టిందంటే, ఆ పని వాళ్ళతో ఇంటర్వ్యూ లు అవీ ఇవీ అని మొత్తం పి.ఎల్.గ్రూప్ కంపెనీలకే చెడ్డ పేరు తెస్తారు", అన్నాడు మహేష్ కొంచెం ఆందోళనతో.

పి.ఎల్. ఓ నిమిషం ఏమి మాట్లాడలేదు. అంటే ఆలోచిస్తూ ఉండాలి, అని అనుభవ పూర్వకంగా అనుకున్నాడు మహేష్.

"టాక్స్ తగ్గించడానికి ఓ ట్రస్ట్ స్థాపిస్తే మంచిదన్నావు కదా మహేష్. అలానే చేద్దాం. ట్రస్ట్ స్థాపించి, ఆ ట్రస్ట్ డబ్బులతో ఓ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ కట్టేదాం. ఆ విధంగా ఈ కొత్త జబ్బు గొడవల నుండి, ప్రెస్ కళ్ళ నుండి మన గ్రూప్ దూరమై పోవచ్చు", అన్నాడు పి.ఎల్.

"మంచి ఐడియా నే సార్. అన్ని విధాలా మనకు సరి పోతుంది", అన్నాడు మహేష్.

"ఇది ఇక్కడి లోకల్ సమస్యకు మాత్రమే పరిష్కారం అనుకోవద్దు. ఈ హాస్పిటల్స్ లోను బాగా లాభాలు ఉన్నాయి. డిమాండ్ ఉన్న ప్రతీ చోట, అన్ని మహా నగరాలలోను హాస్పిటల్స్ ట్రస్ట్ కింద కట్టడానికి ఓ పథకం తయారు చేయి. అలానే, మన కార్పొరేట్ పి.ఎల్ గ్రూప్ కింద ఫార్మసీ ల చైను, ఆరోగ్య భీమా పథకాల తో ఓ భీమా సంస్థ కూడా ఉండేటట్లు ప్రాజెక్ట్ ప్లాన్ తయారు చేయి. అలానే ట్రస్ట్ చైర్మన్ పదవికి పద్మ భూషణ వచ్చిన డాక్టర్ పాణి ఉన్నారు కదా,

ఆయనతో ఓ సారి మాట్లాడుతాను. నువ్వు కూడా ఆయనను కలిసి, హాస్పిటల్ ఎలా కట్టాలో ఆయనతో మాట్లాడి ఆయన సలహాల ప్రకారం ప్రపోసల్ పంపిచ్చు", అన్నాడు పి.ఎల్.

పి.ఎల్. గ్రూప్ ఇలా ఎదిగిపోవడం అందులో తనకు కీలక స్థానం ఉండడం సంతోషంగా ఉంది మహేష్ కు. కంపెనీ కారు, కంపెనీ ఇల్లు దాదాపు అన్ని ఖర్చులు కంపెనీ అకౌంట్ల లోకే పోతున్నాయి. జీతమంతా అలానే బ్యాంకులో జమ అయ్యిపోతున్నది. పిల్లలు కూడా ఊటీ లో బోర్డింగ్ స్కూల్లో చదువుకుంటున్నారు. ఆఫీస్ కూడా కంపెనీ నే కట్టుతున్నది. పి.ఎల్. ఆంతరంగిక టీం లో ఉన్న ఓ పది ఉద్యోగుల బాగోగులు పి.ఎల్ చాలా బాగా చూసుకుంటాడు. అందువల్ల మహేష్ తో బాటు వీరందరికి పి.ఎల్. అంటే వీరాభిమానం, అత్యంత విశ్వాసం. వీరి ద్వారానే పి.ఎల్. ఇంత పెద్ద పి.ఎల్.గ్రూప్ కంపెనీ లను సమర్థవంతంగా నడప గలుగుతున్నాడు.

ఇంకా ఏమైనా ఉందా అన్నట్టు పెట్టిన మహేష్ ముఖం చూసి, "అన్నట్టు, బయప్ప రెడ్డితో మొదలెట్టాను కదా, ఎర్రా సామి మీద కూడా ఓ కన్నేసి ఉంచు. వచ్చే ఎన్నికలలో ఎర్రా సామి వాళ్ళ పార్టీ ఎలెక్షన్లో గెలిచే అవకాశాలు ఉన్నాయని వింటున్నాను. మన తోలు ఫ్యాక్టరీల అమ్మకం ఎర్రా సామి కూడా ముందే చెప్పు. వాళ్ళు డబ్బు చేసుకుంటారు", అన్నాడు పి.ఎల్.

మహేష్ "ఎర్రా సామి హవాలా ఇస్తే చాలంటున్నాడు. వాళ్లకు విదేశీ మార్కెట్లలో డ్రగ్స్ అవీ కొనడానికి విదేశీ మారకం కావాలి. మనం డాలర్స్ విదేశాలలో ఇస్తే ఇక్కడ రూపాయలు క్యాష్ లో ఇస్తాడు. అది మనకు లాభమే. బ్యాంక్ రేట్ కంటే మంచి రేట్ ఇస్తున్నాడు", అన్నాడు.

"మరి అంత క్యాష్ ఏమి చేస్తావు?", అడిగాడు పి.ఎల్.

"మన ఫ్యాక్టరీల లో పని చేస్తున్న డైలీ పని వారికిచ్చే దినసరి వేతనాలు మొత్తం మనం ఎర్రా సామి ఇచ్చే క్యాష్ తో సరిపుచచ్చు. అలా వేతనాలకి పోగా మిగిలిన డబ్బులు, బోనస్ కింద, కంపెనీ కార్ల ఖర్చుకి, మన టాప్ ఉద్యోగుల రివార్డుల కని మనం ఏర్పాటు చేసిన ట్రిప్పులకు క్యాష్ రూపేన ఇచ్చేయొచ్చు. ఆ లాజిస్టిక్స్ నాకు వదిలేయండి. నేను చూసుకుంటాను", అన్నాడు మహేష్.

రూముకు బయట పోబోతున్న మహేష్ ఎదో గుర్తు వచ్చినట్లు, చటుక్కున ఆగి పి.ఎల్. వైపు తిరిగి

"చెప్పడం మరచి పోయాను. వినోద్ నుండి ఓ ఇన్విటేషన్ వచ్చింది. ఐ.టి.సి. మౌర్య హోటల్ లో కంపెనీ సి ఈ ఓ, సి ఎఫ్ ఓ లకు ఓ కాన్ఫరెన్స్ ఉంది. అందులో మన వినోద్ కూడ ఓ 'కీ నోట్ స్పీకర్' గా మొన్ననే విడుదలైన బడ్జెట్ లో

ప్రకటించిన టాక్స్ మార్పుల గురించి మాట్లాడుతున్నాడు. ఆ టైం లో నాకు డిల్లీ లో పని ఉంది, పోదామనుకుంటున్నాను. మీరు వస్తారా?", అన్నాడు మహేష్

"ఎర్రా సామిని ఓ సారి కలవాలి. నీతో బాటు నాకు ఓ టికెట్ బుక్ చేయి. వినోద్ అప్పుడే అడిషనల్ కమిషనేర్ అయ్యిపోయాడా? చాలా తొందరగా పై పదవులు అందుకున్నాడు. నాకు ఆ అబ్బాయిలో స్పార్క్ అప్పుడే తెలిసింది", అంటూ మెప్పుకోలుగా అన్నాడు పి.ఎల్.

"క్లాస్ ఒన్ లో చేరాడు కదండీ. వాళ్లే ఈ ప్రభుత్వ శాఖలకు మకుటం లేని మహారాజులు. మీకు కూడా టికెట్ బుక్ చేస్తాను. చాణక్యపూరి లోనే మన హోటల్ కూడా బుక్ చేస్తాను", అన్నాడు మహేష్

కాన్ఫెరెన్సు ముందు వరుసలో నే కూర్చున్నారు, మహేష్, పి.ఎల్ లు. తెలిసిన ఇతర సి ఈ ఓలు, పి.ఎల్ దగ్గరకే వచ్చి పలకరించి పోతున్నారు. మీటింగ్ మొదలవ్వడంతో స్టేజి మీదకి వినోద్ ని పరిచయం చేసి పిలిచారు. వినోద్ ఈ మధ్యనే అమెరికాలో కూడా ఆ దేశంలో జరిగిన ఓ సమావేశంలో భారత ప్రతినిధి గా పోయాడు అని తెలిసి పి.ఎల్ సంతోషించి, ఇతరులతో బాటు చప్పట్లు కొట్టాడు.

వినోద్ ముందు వరుసలో కూర్చున్న పి.ఎల్ ను చూసి గుర్తు పట్టి పలకరింపుగా నవ్వాడు. పి.ఎల్. పక్కన కూర్చున్న మహేష్ ను కూడా గుర్తు పట్టాడు. మహేష్ వినోద్ ని కలిసింది కొన్ని ఏళ్ల క్రితం టాక్స్ ఆడిట్ చేసి నప్పుడే. మళ్లీ కలవలేదు. బయప్ప రెడ్డి ద్వారా ఆ ఆడిట్ తప్పించు కున్నందుకు వినోద్ కు పి.ఎల్. మీద ఆయన కంపెనీల మీద కోపం లేదు కదా. ఎందుకు ఇప్పుడీ కాన్ఫరెన్స్ కు పిలిచి నట్లు? ఆ ఆలోచనల స్రవంతి ని భంగం చేస్తూ వినోద్ తన స్పీచ్ మొదలెట్టాడు. బడ్జెట్ లో ప్రవేశ పెట్టిన మార్పుల వల్ల కార్పొరేట్ రంగంలో ఉన్న వారికి, టాక్స్ లెక్కవేయడం, కట్టడం ఎంత సులభంమైనదో విశదీకరించాడు. మహేష్ వినోద్ చెప్పిన కొన్ని కిటుకులు , తనతో పెట్టుకొనే పాకెట్ నోట్ బుక్ లో రాసుకున్నాడు.

స్పీచ్ చివర ప్రశ్నలు అడగమంటే, పి.ఎల్. అమెరికాలో వినోద్ పాల్గొన్న సమావేశం గురించి చెప్పమన్నాడు.

వినోద్ అనర్గళంగా మాట్లాడ గలడు. అడిగిన ప్రశ్నల కు అప్పటికప్పుడు ఆశువుగా జవాబు చెప్పడంలో వినోద్ తెలివి తేటలు, అతని ఆలోచనల పరంపరలో ఉన్న స్పష్టత అక్కడ వచ్చిన వారందరికి బాగా నచ్చింది.

"అమెరికాలో సెప్టెంబర్ తొమ్మిది తీవ్రవాదుల దాడుల తరువాత, అంతర్జాతీయ సహకారం ఎంత అవసరమో తెలిసింది. తీవ్రవాదులు దేశ సరిహద్దులు దాటి ప్రపంచంలో ఎక్కడైనా దాడి చేయగలిగినప్పుడు, ఇది అన్నీ దేశాల అంతర్జాతీయ సమస్య అవ్వుతుంది. ఈ సమస్య పరిష్కారంగా, పలు దేశాలలో వ్యాపారం చేస్తున్న వారిని గుర్తు పట్టడం

ఎలా, వారు చేస్తున్న వ్యాపారం వివిధ దేశాల చట్టాలను ఉల్లంఘించకుండా చేస్తున్నారా. లేక కావాలని ఉల్లంఘించి నేరాలు చేస్తున్నారా అన్న విషయాలు చర్చించాం. అలానే ఆఫ్ఘనిస్తాన్ లో తాలిబన్ తీవ్రవాదులు తమ దాడులకు కావలసిన డబ్బు ఎలా సేకరిస్తున్నారో ఓ కేస్ స్టడీ ద్వారా పరిశీలించాం.

తాలిబాన్ కి ప్రతీ సంవత్సరం దాదాపు 4 మిలియన్ డాలర్లు ఆదాయం ఉంది. అక్కడి ప్రజలు కాబూల్, హెల్మాండ్ ప్రాంతాలలో నల్లమందు కోసం పంటలు పండిస్తున్నారు. దాని నుండే కొకైన్, హెరాయిన్ ఉత్పత్తి చేసి ప్రపంచం లో అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. దీని వల్ల ఏటా ఆదాయం 400 మిలియన్ డాలర్లు అని అంచనా. అందులో 10 శాతం తాలిబాన్ ఈ ప్రజలకు పాదుకాపు ఇచ్చినందుకు సుంకం లాగా వసూలు చేసి తమ దాడులకు ఉపయోగిస్తున్నారు. వాళ్లకు కావలసిన ఆయుధాలు కొనాలంటే అమెరికన్ డాలర్స్ కావాలి కాబట్టి పలు దేశాలలో ఉన్న హవాలా వ్యాపారస్తులు కూడా ఈ తాలిబన్ కి, వారి డ్రగ్స్ వ్యాపారానికి తెలుసో , తెలియకనో సహకరిస్తున్నారన్నది నిజం. ఇదెలా అరి కట్టాలని చర్చించాం", అని తన అమెరికా ట్రిప్ వివరాలు పంచుకున్నాడు వినోద్.

"టాక్స్ లు పెంచడం ఎందుకు. టాక్స్ లు తగ్గిస్తే కార్పొరేట్ రంగం, ఆ మిగిలిన డబ్బులతో మరింత ఉత్పత్తి చేసి, ప్రజల, తద్వారా దేశాభివృద్ధి కి దోహద పడొచ్చు కదా", మరొకరు వినోద్ ని ప్రశ్నించారు.

"మీరు ట్రికిల్ డౌన్ ఎకనామిక్స్ గురించి మాట్లాడు తున్నారు. ఎలాంటి మార్గం ఎన్నుకున్న కీలక మైన విషయం లెక్కలు సరిగ్గా వేసి తమ వంతు టాక్స్ అందరూ కడుతున్నారా లేదా అన్నదే. టాక్స్ వల్ల వచ్చే డబ్బే ప్రభుత్వాలకు ముఖ్య ఆదాయం. అది కొరవడితే రోడ్లు కట్టలేరు, ఎలక్ట్రిసిటీ కోసం ప్రాజెక్టులు కట్టలేరు, పిల్లలకు ప్రభత్వ పాఠశాలలు ఉండవు, పై చదువుల కు ఐ ఐ టీ లాంటి యూనివర్సిటీ లు నెలకొల్పలేరు. నేరాలను అదుపులో పెట్టడానికి పోలీసు, దేశ భద్రత కు సైన్య దళాలు ఉండవు. అందుకే ప్రతీ వ్యక్తి లాగే కార్పొరేట్ రంగంలో ఉన్న ప్రతీ కంపెనీ తమ వంతు పన్నులు కట్టాలి. ఎగగొట్ట ప్రయత్నిస్తే లాభాలు రావొచ్చునేమో కానీ, అది  ప్రజల డబ్బు దోచి నట్లే. దొరికితే దాని పర్యవసానం ఘోరం గా ఉండే టట్లు చేయడానికి తీసుకోవలసిన చర్యల గురించి కూడా చర్చించాం. ముందు ముందు ఈ సమావేశం లో పాల్గొన్న దేశాలన్నీ వారి దగ్గరున్న అంతర్జాతీయ గా వ్యాపారం చేసే కంపెనీల లావా దేవిలు పంచుకోవాలి అని నిర్ణయం తీసుకున్నాము  ఇక రాబోయే దినాలలో టాక్స్ ఎగవేత చాలా క్లిష్టతరమైపోతుంది. దొరికితే వాళ్లు బిజినెస్ కొనసాగడం అసాధ్యమయ్యేటట్లు చర్యలు తీసుకుంటాం", అని ముగించాడు వినోద్

వినోద్ మాటలు విన్న మహేష్, వినోద్ మాటలు తమను ఉద్దేశించేనా అని అనుమానం వచ్చింది. బయప్ప రెడ్డి ద్వారా పి.ఎల్ కంపెనీల మీద టాక్స్ ఆడిట్ తప్పించినది వినోద్ ఇంకా మనస్సులో నే పెట్టుకొని ఇలా పిలిచి హెచ్చరిస్తున్నాడా? మహేష్ పి.ఎల్ వైపు చూసాడు. పి.ఎల్ ముఖం లో చెరగని చిరునవ్వు అలానే ఉంది

– 21 –

టాంప, ఫ్లోరిడా

సెప్టెంబర్, 2014

విశ్వంతో బాటు సీత కూడా వచ్చింది సర్జరీ కన్సల్టేషన్ కి. కానీ విశ్వం ఆలోచనలు, ఆఫీసు చుట్టే తిరుగుతున్నాయి. విశ్వంకి జూలి రాకతో ఏదో అనుమానం మనస్సులో తోడేయ సాగింది. బెత్ కు తనంటే పడటం లేదు. తనూ ఈ కాన్సర్ అప్పాయింట్మెంట్లని తరచు పని నుండి పర్మిషన్ తీసుకోవటం బెత్ ఎలా తీసుకొంటున్నదో తెలియదు. తన కంపెనీలో ప్రతీ సంవత్సరం క్రిస్మస్ ముందు, కాస్ట్ కటింగ్ అని ఉద్యోగాల నుంచి పీకేస్తూ ఉంటారు. పండగ ముందు ఇలా చేయడం, అదేం రాక్షస బుద్ధో. ఇంత వరకు ఈ కంపెనీలో ఉద్యోగం కాపాడుకుంటూ వచ్చాడు విశ్వం. ఈ సారెందుకో తనను కూడా తీసేస్తారేమో అన్న అనుమానం మనస్సులో నాటుకొని, పెరగడం మొదలెట్టింది. అందుకే సర్జరీ ఎప్పుడు కావాలని హాస్పిటల్ లో అడిగితే, ఎంత తొందరగా అయ్యితే అంత మంచిది అన్నాడు విశ్వం. ఓ పది రోజుల తరువాత, శుక్రవారం మధ్యాహ్నం అంటే సరే అన్నాడు. తనతో ఒక్క మాట కూడా అడక్కుండా, విశ్వం ఇంత ఆత్రంగా సర్జరీ తారీఖు ఒప్పుకోవడం సీత కు ఓ మూల చివ్వుక్కనే అనిపించింది. కానీ ఈ మధ్య విశ్వం ఏమి చేసినా ఓ మాట కూడా అనకుండా సర్దుకు పోతూఉంది సీత. విశ్వం పడుతున్న ఆందోళన, సీతకు అర్థం అవ్వుతూనే ఉంది. కాదంటే ఇదివరకు, ప్రతీ చిన్న విషయం పంచుకొని, కలిసి చేసే వారు, ఈ సారి ఈ విషయంలో వీలు కాకుండా ఉంది.

ఇంటికి వచ్చిన తరువాత కొంచెం గొడవే పడింది.

"విశ్వం, ఎందుకు ఈ తొందర. ఓ ఇద్దరు ముగ్గురిని అడిగి తెలుసుకుని డేట్ నిర్ణయించి వుండవచ్చు కదా. దానికి తోడు, ఆపరేషన్ ముందు, ఫ్యామిలీ డాక్టర్, కార్డియోలోజిస్ట్ ల నుండి ఆపరేషన్ కి అభ్యంతరం లేదని సర్టిఫికెట్ లు తీసుకోవాలి. మీరు నేను లీవులు అప్లై చేయాలి. అంత రష్ ఎందుకు", అంది సీత.

"నీకు చెప్తే అర్థం కాదులే. వెంటనే సర్జరీ చేసుకోవడం మంచిదనిపించింది నాకు. ఈ టెన్షన్ భరించడం కష్టం గా ఉంది", అన్నాడు కొంచెం విసుగు, నిస్పృహలతో.

"కనీసం డాక్టర్ వెంకటేసులు తో మాట్లాడండి. ఆయన సలహా ప్రకారం పోదాం", అంది సీత

విశ్వం సరే అనడంతో సీతనే డాక్టర్ వెంకటేసుల కు ఫోన్ చేసి స్పీకర్ ఫోన్ మీద పెట్టింది. విశ్వం సర్జరీ వివరాలు చెప్పాడు.

"విశ్వం సర్జరీ ఓ నెల ఇటూ అటూ అయ్యినా పరవాలేదు. సర్జరీ లో కాంప్లికేషన్లు వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయి. సర్జరీ చేసినప్పుడు ఏ మాత్రం వదలకుండా జీరో మార్జిన్ తో కాన్సర్ మొత్తం తీసేయాలి. దానికి తోడు నీవు సర్జన్ ల గురించి కొంచెం రీసెర్చ్ చేయాలి. ఇంకో విషయం ఆపరేషన్ పొద్దున్న పూట్ల ఉంటే మంచిది. వారం మొదట్లో చేసుకొంటే బాగుంటుంది. శుక్రవారం మధ్యాహ్నం మంచి టైం కాదేమో. వీకెండ్ లో నువ్వు పోస్ట్ ఆపరటివ్ స్టేజిలో ఉన్నప్పుడు, అందరూ డాక్టర్లు అందుబాటులో ఉండక పోవచ్చు. కాల్ మీద ఎవరుంటే వారు వస్తారు. నీకో వెబ్ లింక్ పంపిస్తాను. అందులో ఈ దేశంలో ఉన్న అందరి సర్జన్ వివరాలు, వాళ్లు చేసిన ఆపరేషన్ల సంఖ్య, అందులో ఎన్ని సఫలంగా చేయగలిగారో వుంటుంది. ఇప్పుడు నేను నీకు చెప్పిన డాక్టర్ మంచి అతనే. కాదంటే మీ పక్క ఊళ్ళో ఉన్న మరో సర్జన్ కి చాలా మంచి పేరు ఉంది. డాక్టర్లకే నీ వంటి కాన్సర్ వస్తే ఆయన దగ్గరకు పోతారు. ఓ 70 మైళ్ళ ప్రయాణం నీకు లెక్క కాదు. నీవు సరే నంటే, నేను ఈ కొత్త సర్జన్ కు ఫోన్ చేసి నీకు తొందరగానే అప్పాయింట్మెంట్ ఇప్పించ గలను. నువ్వే కొంచెం రీసెర్చ్ చేసి మంచి నిర్ణయం తీసుకో", అన్నాడు డాక్టర్ వెంకటేసులు.

విశ్వం, సీత మరుసటి రోజంతా వెంకటేసులు ఇచ్చిన వెబ్ లింక్, గూగుల్ ద్వారా మిగితా సైట్లు శోధించారు.

చివరకు, డాక్టర్ వెంకటేసుల అన్నట్లు ఈ కొత్త సర్జన్ వద్దకు పోవడం మంచిదనిపించింది. ఈ సర్జన్ వేల లెక్కల్లో ఆపరేషన్ లు చేయడమే కాదు, వాటి ఫలితాలు కూడా అద్భుతంగా ఉన్నాయి. అసఫలమైన ఆపరేషన్ల సంఖ్య, 1 శాతం కంటే తక్కువ ఉంది.

నిర్ణయం తీసుకున్న తరువాత, అప్పటికే కమిట్ అయిన సర్జన్ తో ఎలా ఈ వార్త అంద జేయడం అనుకుంటుండగానే సర్జరీ ఆఫీసు నుండి విశ్వం కు కాల్ వచ్చింది, ఇది వరకే అనుకున్న ఈ సర్జరీ శుక్రవారం నుండి పోస్ట్ పోన్ చేయాలని. సర్జన్ కు ఏదో అనుకోకుండా పని తగిలినదంట.

విశ్వం కు సమస్య ఇట్టే తీరిపోయిందని సంతోషమేసింది. ఆపరేషన్ ప్రస్తుతం క్యాన్సల్ చేయమని ఫోన్ పెట్టేసాడు.

కొత్త సర్జన్ తో అప్పాయింట్మెంట్ కోసం డాక్టర్ వెంకటేసులు కి టెక్స్ట్ మెసేజ్ పంపించాడు.

మరుసటి రోజు ఆఫీసుకు వెళ్తూనే రాబర్ట్ కాల్ చేసాడు. ఆఫీస్ కు పని మీద వచ్చానని, కెఫెటేరియా లో కలుద్దామని. విశ్వం చేరేసరికి రాబర్ట్ తను కాఫీ తాగుతూ, విశ్వం కోసం ఆర్డర్ చేసిన కాఫీ విశ్వం చేతికందించాడు.

"హౌ అర్ యు ?", అంటూ వెంటనే విషయంలోకి దూకేశాడు రాబర్ట్ " నువ్వు అడిగావు కదా అడ్రసులు వెదకమని. రెండు అడ్రెస్ లు మాటి మాటికి కనిపిస్తున్నాయి పిరమిడ్ అకౌంట్లలో. రెండు పోస్ట్ బాక్స్ ఉన్న అడ్రస్ లే. ఒకటి కేయ్మన్ ద్వీపంలో ఉంది. రెండవది బ్రిటిష్ వర్జిన్ ద్వీపం లో ఉంది. రెండూ కెరీబీన్ ద్వీపాలే. ఈ ప్రాంతాలు మనీ లాండరింగ్ కు కేంద్రాలు. అందులోనూ కేయ్మన్ ద్వీపంలోని కంపెనీ మొన్ననే పిరమిడ్ గ్రూప్ రియల్ ఎస్టేట్ కంపెనీ నుండి దాదాపు 100 మిలియన్స్ పెట్టి మయామీ దగ్గర ఓ ఇల్లు కొన్నది. ఆ ఇల్లు 60 మిలియన్స్ గా గత రెండు ఏళ్ళు లిస్ట్ చేసారు. ఇప్పుడు మరో 40మిలియన్స్ ఎక్కువబెట్టి పిరమిడ్ గ్రూప్ నుండి ఈ కేయ్మన్ కంపనీ కొన్నదంటే, అది పిరమిడ్ గ్రూప్ కు ఇస్తున్న కమిషన్ లేక ఏదో ఒక పనికి ఇస్తున్న నల్ల ధనం లాగానే పరిగణించాలి. అలానే రెడ్ రాక్ నుండి వివిధ రూపాలలో బ్రిటిష్ వర్జిన్ ద్వీపం లోని కంపెనీకి డబ్బులు పోతున్నాయి. అన్ని చిన్నచిన్న లావా దేవిలే. కానీ కలిపి చూస్తే మిలియన్స్ లో ఉంటుంది. ఈ రెండు ద్వీపాలలో ఉన్న కంపెనీలు ఒకరికే చెందుతాయి అని నా అంచన. కానీ ఋజువు లేదు", అన్నాడు.

విశ్వం కు తను ఊహించింది సరినే అనిపించింది. తాను సరైన మార్గంలోనే పోతున్నాడు అన్న నమ్మకం ఇంకొంత దృఢ పడింది. రాబర్ట్ వెలికి తెచ్చిన రెండు కంపెనీల మధ్య సంబంధం కనుక్కోవడం అంత సులభం కాదు.

"థాంక్స్ బాబ్. కొన్ని రోజులు పరిశీలిద్దాం, ఆలోచిద్దాం. ఏమైనా ఐడియాలు లేక మరిన్ని విషయాలు బయట పడవచ్చు", అని రాబర్ట్ నుండి వీడ్కోలు తీసుకున్నాడు విశ్వం.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments